సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం । 4 । మార్చి । 2023



దోషులను కఠినంగా శిక్షించాలి

ప్రీతి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ కోరారు. - 8లో▸



యోగాతో మానసికోల్లాసం

ప్రతిఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకుంటే శారీరక, మానసిక సమస్యల నుంచి బయటపడవచ్చని పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0° /20.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులతోపాటు సూర్యరశ్మితో వాతావరణం వేడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కానిస్టేబుల్ కిరణ్‌కు ఎస్పీ అభినందనలు



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలకేంద్రంలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై నుంచి అదుపుతప్పి పడిపోవడంతో గుండెపోటుకు గురైన మండల కేంద్రానికి చెందిన వంశీకి సీపీఆర్‌తో ప్రాణం పోసిన కానిస్టేబుల్ కిరణ్‌ను శుక్రవారం తన కార్యాలయంలో ఎస్పీ సురేందర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. రూ.5వేల నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణతో పాటు గుండెపోటుకు గురైన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ ద్వారా ప్రాణాలు కాపాడి ఆస్పత్రికి తరలించడం అభినందించదగిన విషయమన్నారు. ఆకస్మిక గుండెపోటు కేసులు పెరుగుతుండడంతో త్వరలో పోలీసులందరికీ సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ బండ సతీష్, సీసీ ఫసియోద్దీన్ ఉన్నారు.

అనుమానితులకు ఆశ్రయం కల్పించొద్దు



పలిమెల: అనుమానితులకు ఆశ్రయం కల్పించొద్దని మహదేవపూర్ సీఐ కిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బూర్గుగూడెంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. అనంతరం సీఐ కిరణ్ గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అనుమానంగా కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మావోయిస్టుల మాటలకు ఆకర్షణ చెందకూడదని, వారికి ప్రజలు సహాయం చేయవద్దని హెచ్చరించారు. యువతకు మంచి భవిష్యత్ ఉందని.. చెడు మార్గాలవైపు వెళ్లరాదని సూచించారు. ప్రభుత్వం అనేక ఉద్యోగాల నోటిఫికేషన్లను విడుదల చేసిందని, అర్హత కలిగిన ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొని కష్టపడి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అరుణ్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్ల నిరసన



భూపాలపల్లి అర్బన్: శ్రీరాంపూర్ ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కన్వేయన్స్ డ్రైవర్ హుస్సేన్‌ను తొలగించడాన్ని నిరసిస్తూ ఏరియాలో పనిచేస్తున్న డ్రైవర్లు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జీఎం కార్యాలయ, సింగరేణి ఏరియా ఆస్పత్రి ఆవరణంలో డ్రైవర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ బ్రాంచీ కార్యదర్శి కంపేటి రాజయ్య మాట్లాడుతూ కాంట్రాక్ట్ డ్రైవర్లకు సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. నైపుణ్యం కలిగిన డ్రైవర్లను ఇంటి పనులు, వ్యక్తిగత అవసరాలకు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు రాజు, క్రాంతి, ప్రసాద్, లింగమూర్తి, రమేష్, నవీన్, రవి పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌కు వినతి

సింగరేణి ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మజకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ బ్రాంచీ కార్యదర్శి కంపేటి రాజయ్య, ఆస్పత్రి సిబ్బంది శేషారత్నం, రేవతి, షానా, భాను, కుమార్, ప్రియాంక, వామన్‌రావు, రమేష్ పాల్గొన్నారు.

జాతరకు రావాలని పీఓకు ఆహ్వానం

ఏటూరునాగారం: మంగపేట మండలం రాజుపేట(లక్ష్మి నర్సాపురం)లో ఈనెల 7 నుంచి 11వరకు జరిగే నాగులమ్మ జాతరకు రావాలని శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగ రమేష్ శుక్రవారం ఐటీడీఏలో పీఓ అంకిత్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు.

4 మిషన్లు.. 40 టిప్పర్లు

విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీ కీలకం

టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- వివరాలు 10లో▸

ఎండలు బాబోయ్..

వారం రోజులుగా ఉష్ణోగ్రతల వివరాలు

తేదీ	కనిష్టం	గరిష్టం
ఫిబ్రవరి 25	19	36
ఫిబ్రవరి 26	18	34
ఫిబ్రవరి 27	19	34
ఫిబ్రవరి 28	20	33
మార్చి 1	20	36
మార్చి 2	19	35
మార్చి 3	20	36



పెరిగిన ఉష్ణోగ్రతలు

- మార్చిలోనే 36డిగ్రీలు నమోదు
- ఎండల తీవ్రతతో వడగండ్ల వర్షాలు పెరిగే అవకాశం

భూపాలపల్లి అర్బన్: వేసవి పూర్తిగా ప్రారంభం కాకముందే భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. శివరాత్రి తర్వాత నుంచి ఎండలు విపరీతంగా పెరిగాయి. ఇన్నాళ్లు రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నా, క్రమేపీ పెరుగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎండల తీవ్రత మరింత ఎక్కువగానే ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. జిల్లాలో కోల్‌బెల్ట్ ప్రాంతం విస్తరించి ఉండటంతో ప్రతీ ఏడు వేసవికాలంలో ఉష్ణోగ్రత 42, 44డిగ్రీల కన్నా ఎక్కువగా నమోదవుతోంది. ప్రస్తుతం మార్చి నెల ప్రారంభంలోనే ఎండల తీవ్రత ఈ విధంగా ఉంటే రానున్న ఏప్రిల్, మే నెలల్లో ఎండలు ఎంత తీవ్రంగా ఉంటాయో అని జనాలు భయపడుతున్నారు. 2015లో జిల్లాలోని చెల్పూర్‌లో రికార్డు స్థాయిలో 48.9 ఉష్ణోగ్రత నమోదైంది. ఉష్ణోగ్రత పెరగడంతో క్యూములోనింబస్ మేఘాల వల్ల ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వానలు కురిసే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తుంది. దీంతో ఇటు వేసవితో ప్రజలకు, వడగళ్లతో యాసంగి పంటలకు ఇబ్బందులు తప్పకపోవచ్చు.

మొదలైన వేసవి తాపం..



ఇప్పటికే భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గరిష్టంగా 37 డిగ్రీలు, కనిష్టంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పదిహేను రోజుల నుంచి ఎండల తీవ్రత పెరుగుతోంది. వాతావరణం పొడిగా మారడంతో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఉదయం 10గంటల నుంచే ఉష్ణోగ్రతల తీవ్రత మొదలవుతోంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పటికీ, వారం రోజుల క్రితం వరకు రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగానే ఉండేవి. ఇప్పుడు రాత్రివేళల్లో కొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలు దాటుతున్నాయి. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది ఉష్ణోగ్రలు గతేడాది కన్నా ఎక్కువగా ఉంటాయని చెబుతోంది. జిల్లాలో కేటీపీపీ, బొగ్గుల ప్రాంతం ఉండటంతో ప్రతీ సంవత్సరం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈసారి కూడా జిల్లా కేంద్రమైన భూపాలపల్లిలో ఎండ తీవ్రత తప్పకపోవచ్చు. ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో రెండు రోజుల నుంచి సగటున పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలను దాటుతున్నాయి. వారం రోజుల క్రితం రాత్రి పూట ఉష్ణోగ్రతలు సగటు 18 డిగ్రీలు ఉంటే, ప్రస్తుతం సగటున 24 డిగ్రీలు నమోదవుతున్నాయి.

యాసంగికి ఇబ్బందులు

ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో దాదాపు 30 వేల ఎకరాల్లో యాసంగి పంటలు సాగవుతున్నాయి. ఎండల తీవ్రతతో వ్యవసాయబోర్ల వినియోగం పెరిగింది. బోర్ల కింద సాగవుతున్న పంటలకు సరిపడా నీరు అందడం లేదు. వేసవి పూర్తిస్థాయిలో రాకముందే ఈ పరిస్థితి ఉంటే మే నెలలో పంటలకు నీటి తిప్పలు తప్పేలా లేదు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి ఈదురుగాలులతో కూడిన వడగండ్లు పడే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వరి, మిరప, ఇతర ఆరుతడి పంటలకు వడగండ్లతో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. మూడు నాలుగేళ్లుగా వేసవి కాలంలో వడగండ్లు, ఈదురుగాలుల కారణంగా చాలాచోట్ల వరి పంట నేల కొరిగింది. కోత దశలో వర్షాలు రావడంతో వరి, మొక్కజొన్న సాగుచేసిన రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ఈసారి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణం కమనీయం

కోటంచకు పోటెత్తిన భక్తజనం

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి బ్రహ్మోత్సవాలలో కల్యాణం తలంబ్రాలు ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి కొనసాగిన నిత్య నిధి, ఆరాధన, ధ్వజారోహన గరుడ ముద్ద కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలుచేశారు. గరుడ ముద్ద ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అశ్వవాహనసేవలో స్వామివారిని ఊరేగించి పల్లకీ సేవ అనంతరం ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు.

రేగొండ పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు..

జాతరలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. కల్యాణం (తలంబ్రాలు) సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరుకాగా ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. రేగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటుచేసి భక్తులకు వైద్యసేవలను వైద్యాధికారి హిమబిందు ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్, చైర్మన్ మాదాడి అనితకరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ పబ్బ శ్రీనివాస్, ఎంపీటీసీ ఎర్రబెల్లి రవీందర్‌రావు, ఉప సర్పంచ్ మహేందర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



గరుడ ముద్ద కార్యక్రమంలో ప్రత్యేక పూజలు..



అశ్వవాహనసేవ



హాజరైన భక్తులు

జిల్లాను అభివృద్ధిలో ముందుంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి

- జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి
- వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- పీహెచ్‌సీల్లో వైద్యులను నియమించాలని సభ్యుల బైఠాయింపు

భూపాలపల్లి రూరల్: జిల్లాను అభివృద్ధిపథంలో ముందుంచాలని జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి అన్నారు. శుక్రవారం మంజూర్‌నగర్‌లోని ఇల్లందు క్లబ్‌హౌస్‌లో జక్కు శ్రీహర్షిణి అధ్యక్షతన జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితోపాటు అదనపు కలెక్టర్ దివాకర ముఖ్యఅతిథులుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి మాట్లాడుతూ 29 శాఖలకు సమావేశంలో సమయం లేనందున ఐదు శాఖల వరకే చర్చించినట్లు తెలిపారు. ఈనెల 14న ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి మిగితా శాఖలకు సంబంధించి చర్చించుకుందామని సభ్యులకు సూచించారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ... వేసవి సమీపిస్తున్న దృష్ట్యా జిల్లాలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మండలాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకొని నీటి ఎద్దడిపై చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ముందస్తు సమాచారం లేకుండా భగీరథ పైపుల పనులు చేయించడంతో భూపాలపల్లి మండలంలోని చాలా గ్రామాల్లో ఐదు రోజులుగా నీరు లేకుండా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో అదనపు కలెక్టర్ దివాకర ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు సమన్వయంతో గ్రామాల్లో నీటి సరఫరా చేయించాలన్నారు. గ్రామాల్లో ముందుగా సమాచారం ఇచ్చి రిపేర్లు చేయాలన్నారు.

సమస్యలపై అధికారుల నిలదీత..

సమావేశంలో వ్యవసాయం, ఉద్యానవనం, వైద్యం, మిషన్ భగీరథ, డీఆర్‌డీఏ తదితర శాఖల ద్వారా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల ప్రగతిని సంబంధిత శాఖల అధికారులు వివరించారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష పార్టీల జెడ్పీటీసీలు, ఎంపీపీలు వారి మండలాల్లో ఉన్న సమస్యలపై అధికారులను నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ సభ్యులు మాట్లాడుతూ... జిల్లా వ్యవసాయ అధికారి పూర్తి సమాచారం ఇవ్వకుండా గతంలో ఇచ్చిన సమాచారం ఇస్తూ సభను తప్పుతోవపట్టిస్తున్నారన్నారు. జిల్లాలోని ఫర్టిలైజర్ షాపుల యాజమానులతో కుమ్మక్కై షాపులను తనిఖీలు చేయడంలేదని ఆరోపణలు చేశారు. తనిఖీలు చేపట్టకపోవడంతో షాపుల యాజమానులు అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్నారని తెలిపారు. అధికంగా కురిసిన వర్షాలతో 30శాతం లోపు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించేవిధంగా సభ తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. కాటారం, మల్హర్, మహాముత్తారం, మహదేవపూర్, పలిమెల మండలాల్లో ధరణి పోర్టల్ వచ్చినప్పటినుంచి పట్టాలున్న రైతుల భూములకు పాస్‌బుక్‌లు లేకుండా పోయాయన్నారు. ఈ మండలాల్లో పూర్తి సర్వేయర్‌లను నియమించి భూములను రీసర్వే చేసి నకిలీ పాస్‌బుక్‌లు కలిగి ఉన్న రైతుల పేర్లు తొలగించి అసలు రైతులకు పాస్‌బుక్‌లు ఇప్పించే విధంగా అధికారులను ఆదేశించాలని కోరారు. అన్నారం బ్యారేజీ ముంపు ప్రాంతాలు మునగకుండా కరకట్ట నిర్మించేందుకు రూ.60 లక్షల నిధులు కేటాయించేలా ప్రభుత్వానికి నివేదించాలన్నారు. మహదేవపూర్, మహాముత్తారం మండలంలో ఆలస్యంగా వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సభ్యులు కోరారు. దీంతో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి స్పందిస్తూ అవసరం అయితే ప్రత్యేకంగా అనుమతి తీసుకుందామని ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



పోడియం ఎదుట బైఠాయించిన కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు

సభ్యుల బైఠాయింపు..

కాటారం పీహెచ్‌పీలో నిధుల దుర్వినియోగం చేసిన వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని.. జిల్లాలోని పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని కోరుతూ.. కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు పోడియం వద్ద నినాదాలు చేస్తూ బైఠాయించారు. దీంతో ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ దివాకర కల్పించుకొని దుర్వినియోగం చేసిన నిధులపై విచారణ చేపిస్తామని, పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ రఘువరన్, జెడ్పీ వైస్‌చైర్మన్ కళ్లెపు శోభ, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ఇంటర్మీడియట్, పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్, టెన్త్ పరీక్షల నిర్వహణపై శుక్రవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో మార్చి 15నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఇంటర్, ఏప్రిల్ 3నుంచి 13వ తేదీ వరకు పదోతరగతి వార్షిక పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. మొదటి సంవత్సరం పరీక్షకు 2,130, రెండో సంవత్సరం పరీక్షకు 1,890 మొత్తం 4,020మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందుకు 8సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదో తరగతిలో 1,830మంది బాలురు, 1,821మంది బాలికలు మొత్తం 3,651మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 20పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని అధికారులు తెలిపారు. ప్రభుత్వం పరీక్షల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని చెప్పారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ సురేందర్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి రాంకుమార్, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి దేవరాజం, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్ పాల్గొన్నారు.

కంటి సమస్యల పరిష్కారానికి శిబిరాలు

జిల్లాలోని ప్రజల కంటిచూపు సమస్యలు పరిష్కరించేందుకు కంటివెలుగు శిబిరాలను వినియోగించుకోవాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా సూచించారు. జిల్లా కేంద్రంలోని పాత గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. కంటివెలుగు శిబిరంలో చేస్తున్న కంటి వైద్య సేవల వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ప్రజలకు చేస్తున్న కంటి పరీక్షల తీరును పరిశీలించారు. వివిధ వార్డులలో ప్రజలకు ఆహ్వాన పత్రికలు అందజేసే వివరాలను తెలుసుకున్నారు. కంటి పరీక్షలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వేసవికాలం ప్రారంభమైనందున అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వైద్యబృందాలు ఎప్పటికప్పుడు తమ వద్ద ఉన్న రీడింగ్ గ్లాసుల స్టాక్ వివరాలు పర్యవేక్షించి స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు వచ్చిన వెంటనే సంబంధిత లబ్ధిదారులకు అందజేసి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. కంటి వెలుగు శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు కలెక్టర్ రీడింగ్ అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రిజిస్టర్ పరిశీలిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

బీఆర్ఎస్, కాంగ్రెస్‌వి చిల్లర రాజకీయాలు

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు భూపాలపల్లి నియోజకవర్గంలో చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు యుగేందర్‌తో కలిసి కీర్తిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండు పార్టీల నాయకులు సహనం కోల్పోయి కోడిగుడ్లు, టమాటలు, రాళ్లతో దాడులు చేసుకుంటున్నారన్నారు. ఒక పార్టీ నాయకుడు మరో నాయకుడిపై ఆరోపణలు చేస్తూ జిల్లా కేంద్రంలో 144 సెక్షన్ అమలుకు కారకులయ్యారన్నారు. ఇరువురు నాయకుల భూదందాలు, ఇసుక దందాలు ప్రజలకు తెలుసన్నారు. ఇరుపార్టీల నాయకులు దాడులు చేసుకోవడం మానుకొని కోర్టును ఆశ్రయించాలని సలహా ఇచ్చారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధిచెప్పనున్నారని జోస్యం చెప్పారు.



అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కీర్తిరెడ్డి, నాయకులు

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తంచేసి సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కీర్తిరెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎరుకల గణపతి, బట్టు రవి, తుమ్మేటి రాంరెడ్డి, తోట ఓదెలు, కొరె సుధాకర్, జోగుల కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగ్గురిపై కేసు నమోదు

కాజీపేట: కాజీపేట పట్టణంలో మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శుక్రవారం పట్టణంలో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టగా నంబర్ ప్లేటు లేకుండా తిరుగుతుండడమే గాకుండా సరైన కాగితాలు లేవన్నారు. పత్తి నిరంజన్, వడ్డెపల్లి రామకృష్ణ, కట్కూరి సృజన్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

బస్సును ఢీకొట్టిన లారీ

వర్ధన్నపేట: ఆర్టీసీ బస్సును వెనుకనుంచి లారీ ఢీకొట్టడంతో బస్సు వెనుక భాగం దెబ్బతిన్న సంఘటన శుక్రవారం వర్ధన్నపేట పట్టణంలో చోటుచేసుకుంది. జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో జఫర్‌గఢ్ నుంచి వర్ధన్నపేట బస్టాండ్‌కు వెళ్తున్న క్రమంలో వరంగల్ వైపు వెళ్తున్న బొగ్గు లోడు లారీ బస్సు వెనుక భాగాన్ని ఢీ కొట్టింది. దీంతో బస్సు వెనుక భాగం బాగా దెబ్బతింది. అంతకు ముందే ప్రయాణికులు వర్ధన్నపేట పాత బస్టాండ్ వద్ద దిగిపోవడంతో ప్రమాదం తప్పింది.

యువతి అదృశ్యం



వర్ధన్నపేట: కిరాణ షాపుకు వెళ్లి వస్తానని తన కూతురు తిరిగి రాలేదని వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో యువతి తండ్రి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై రామారావు కథనం ప్రకారం.. మండలంలోని బండౌత పురం గ్రామానికి చెందిన మంచాల యాకయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు కాగా పెద్ద కూతురి వివాహం చేశారు. చిన్న కూతురు అఖిల ఈ నెల 14న సాయంత్రం కిరాణసామానుకని వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

రూ.1.72 లక్షలు మాయం

కాజీపేట: ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ రావడంతో లిఫ్ట్ చేసి వారు అడిన వివరాల తెలపడంతో రూ.1,72,291లను పోగొట్టుకున్న ఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి కథనం ప్రకారం.. బాధితుడికి ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నాం.. మీ క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుకోవాలని సూచించగా నిజమేనని నమ్మి వారు అడిగిన వివరాలను చెప్పడంతో బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం అయ్యింది. బాధితుడు మోసపోయినట్లుగా గుర్తించి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.




జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు



హాజరైన కలెక్టర్లు, సీపీ, మున్సిపల్ కమిషనర్, మేయర్



యోగాతో మానసికోల్లాసం



దినచర్యలో భాగం చేసుకోవాలి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఘనంగా ప్రారంభమైన యోగా మహోత్సవ్



యోగా చేస్తున్న మహిళలు

హన్మకొండ కల్చరల్: ప్రతిఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకుంటే శారీరక, మానసిక సమస్యల నుంచి బయటపడవచ్చని, ఓరుగల్లు ప్రజలు యోగా శిక్షణలో పాల్గొనాలని పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ, హార్ట్‌ఫుల్‌నెస్, శ్రీరామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. హనుమకొండ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంతకు ముందు యోగా గురువు, పద్మవిభూషన్ దాజి (కమలేష్ దేసాయి భాయ్ పటేల్)ను స్వాగతించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కన్హా శాంతివనం తరహాలోనే ఓరుగల్లు సమీపంలో శాంతివనాన్ని నిర్మించడానికి తగిన ఏర్పాట్లను చేస్తామన్నారు. వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన భారతదేశంలో యోగా పట్ల ఆసక్తిని కలిగించడం కోసం ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. యోగా గురువు దాజీ మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా యోగాను ఆచరిస్తున్నారని, ధ్యానంతో మనసు ప్రశాంతత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, గోపి, మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్, ప్రఖ్యాత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్, సీపీ ఏవీ రంగనాథ్, కేయూ వీసీ ఆచార్య రమేష్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య, విద్యార్థులు, అధికారులు పాల్గొని శిక్షణ నిపుణుల ద్వారా యోగా, ధ్యానం ఆచరించారు.

మంత్రి ఫోన్ పోయిందంటూ హైరానా

చిల్పూరు: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు చెందిన ఫోన్ పోయిందని తెలపడంతో అధికారులు, పోలీసులు, నాయకులు కొద్ది సేపు హైరానా పడ్డారు. ఈ సంఘటన శుక్రవారం చిల్పూరు మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద చోటు చేసుకుంది. వివరిలాల ఉన్నాయి..వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణానికి హాజరైన మంత్రితో పాటు ఎమ్మెల్యే రాజయ్య, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డిలు హాజరయ్యారు. స్వామివారి తలంబ్రాలు సమర్పించిన అనంతరం వెలుతున్న క్రమంలో తన మొబైల్ ఫోన్ కనిపించడం లేదని తెలపడంతో అందరు హైరానా పడ్డారు. మైకులో సైతం ప్రచారం చేశారు. కాసేపటికి చైర్మన్ శ్రీధర్‌రావు, అర్చకులు స్వామివారి మహిమతో ఫోన్ దొరికిందంటూ మైకులో తెలిపారు. ఇంతకీ ఆ ఫోన్ మంత్రి గారి కారులోనే ఉందనడంతో సంతోషపడ్డారు.



యోగా చేస్తున్న మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు, వీసీ, తదితరులు

భార్యపై భర్త దాడి..

- ఐరన్ పైపుతో కొట్టడంతో తీవ్ర గాయాలు

ఖిలా వరంగల్: భర్త వేధింపులు తాళలేక ఇద్దరి పిల్లలతో కలిసి పుట్టింటిలో తలదాచుకుంటున్న ఓ మహిళను అకస్మాత్తుగా రోడ్డుపై భర్త ఐరన్ పైపుతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. ఈ ఘటన శుక్రవారం శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట చోటు చేసుకుంది. బాధితురాలి తల్లి గద్దల శారద తెలిపిన వివరాల ప్రకారం.. శంభునిపేట నాగేంద్రనగర్ కాలనీకి చెందిన గద్దల శారద కుమార్తె సరిత (27)ను పదేళ్ల క్రితం నర్సంపేట మండలం నాగుర్లపెల్లి గ్రామానికి చెందిన వేల్పుల రఘు (30)కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. రఘు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య సరిత, ఇద్దరు పిల్లలు పోషిస్తున్నాడు. మూడేళ్ల క్రితం రఘు మద్యానికి బానిసై భార్య సరితను కొట్టడంతో వరంగల్ నాగేంద్రనగర్‌లోని పుట్టింటికి వచ్చింది. భార్యాభర్తల పంచాయితీ పలుమార్లు గ్రామ పెద్దల ఎదుట జరిగింది. పద్ధతి మార్చుకుంటానని చెప్పి భార్య, పిల్లలను తీసుకెళ్లి మళ్లీ చిత్ర హింసలకు గురిచేయడంతో సరిత పిల్లలతో కలిసి పుట్టింటిలో ఉంటుంది. ఈ విషయమై రెండేళ్ల క్రితం వరంగల్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో సరిత కేసు పెట్టింది. ఇద్దరి పిల్లలను శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిస్తూ తాను వరంగల్ చౌరస్తాలోని ఓ షాపులో పనిచేస్తూ జీవనం గడుపుతుంది. శుక్రవారం ఉదయం పిల్లలను పాఠశాలకు పంపించి షాపుకు బయలుదేరుతున్న సమయంలో అకస్మాత్తుగా సరిత భర్త రఘు కాపురానికి రాకుంటే చంపేస్తానంటూ ఐరన్ పైపుతో దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. భారీగా స్థానికులు రావడంతో రఘు అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న సామాజిక కార్యకర్త ఎండీ ఫసీ, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రురాలిని ఎంజీఎంకు తరలించారు. సరిత తల్లి శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించినా.. సకాలంలో స్పందించలేదని, స్థానికులు అడ్డుకోవడంతోనే రఘు అక్కడి నుంచి పారిపోయాడని, లేదంటే ఎక్కువ గాయాలయ్యేవని సామాజిక కార్యకర్త ఫసీ తెలిపారు.



భర్త దాడిలో గాయపడిన సరిత

తన ప్రేమను నిరాకరించిందని..

- రైలు కిందపడి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

కాజీపేట రూరల్: తాను ప్రేమించిన అమ్మాయి దక్కదని జీవితంపై విరక్తి చెంది ఓ బీటెక్ విద్యార్థి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాజీపేట, కోమటిపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కె. దయాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన పాలమేని నరేష్ (20) మహేశ్వరంలోని ఓ కళాశాలలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. మృతుడి తండ్రి సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తాను ప్రేమించిన అమ్మాయి తన ప్రేమను నిరాకరించిందని జీవితంపై విరక్తి చెంది చనిపోవాలని నిర్ణయించుకొని కోమటిపల్లి రైల్వే గేట్ సమీపంలో డౌన్ మార్గంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహానికి ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడు...

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకదుర్గ కాలనీలో శుక్రవారం ఇప్పకాయల శివ (25) అనే యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు. జీవితంలో ఆర్థికంగా స్థిరపడాలని మానసిక కుంగుపాటుతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి తల్లి భాగ్యరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు షుకుర్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వైద్యుడు..



సారంగపాణి (ఫైల్)

నెక్కొండ: కుటుంబ కలహాలతో ప్రైవేట్ వైద్యుడు గడ్డం సారంగపాణి (58) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసకున్న సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండలోని హైస్కూల్ సెంటర్‌లో మహేశ్వర ఆస్పత్రి వైద్యుడు కొంత కాలంగా భార్య విజయతో గొడవ కారణంగా భార్యభర్తలు విడాకులకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తంలో డబ్బు ఇవ్వాలని భార్య డిమాండ్ చేయడం, పరువు పోతుందనే మనోవేదనతో నాలుగు రోజుల క్రితం సారంగపాణి ఉరి వేసుకోగా స్థానికులు గమనించి కాపాడారు. మళ్లీ ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో విబేధాలు ఉండటంతో మనస్తాపానికి గురై ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆకతాయిలను పట్టుకున్న షీ టీం



విద్యార్థులతో మాట్లాడుతున్న షీటీం పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్న పాఠశాల వద్ద ప్రతిరోజు సాయంత్రం సమయంలో ఆకతాయిలు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని శుక్రవారం 'సాక్షి'లో 'విద్యార్థినులకు ఆకతాయిల వేధింపులు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన షీటీం పోలీసులు శుక్రవారం సాయంత్రం షీటీం ఏసీపీ డేవిడ్ రాజ్, ఇన్‌స్పెక్టర్ సంజీవరావుల నేతృత్వంలో పాఠశాలకు వచ్చే దారిలో ఉన్న 12 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మహిళల రక్షణకు షీటీం పనిచేస్తాయన్నారు. ఎలాంటి సమయాల్లోనైన మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వాట్సాప్‌లో గాని, సోషల్ మీడియాలోనైన వేధింపులకు గురిచేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలు, మహిళలు 87126 85257, 87126 85142, 87126 85270లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. బాలికలను వేధిస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. అనంతరం అదుపులోకి తీసుకున్న ఆకతాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు విద్యాసాగర్, కుమారస్వామి, ఎస్ఐ స్వాతి, ఏఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు వంశీకృష్ణ, రాంరెడ్డి, పూర్ణ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- సహకరించిన ఇద్దరు కూడా..
- రూ.6లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- జనగామ డీసీపీ పి.సీతారాం వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సీతారాం

జనగామ: చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగతో పాటు సహకరించిన ఇద్దరిని జనగామ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌తో కలిసిన డీసీపీ సీతారాం అరెస్ట్ వివరాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లా రాఘవాపూర్‌కు చెందిన మునిగండ్ల వి జయ్ తాగుడుకు బానిసగా మారి జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో వివిధ జిల్లాల్లో చోరీలకు పాల్పడి జైలు జీవితం కూడా గడిపాడు. అనేక సార్లు జైలుకు వెళ్లి శిక్షలు అనుభవించినా, విజయ్ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో పాటు మరో ఇద్దరి దొంగలతో చేతులు కలిపి గత నెల ఖమ్మం జిల్లా పాల్వంచ నవభారత్ వీధిలో చోరీకి పాల్పడ్డారు. అక్కడి నుంచి గత నెల 20న జనగామకు వచ్చారు. పట్టణంలోని వాసవీ కాలనీ నివాస ముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు శివగారి కిరణ్, రజని ఇంట్లో పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం పక్కా సమాచారంతో ప్రెస్టన్ మైదానం నుంచి పారిపోయే క్రమంలో పట్టుకున్నారు. వారి నుంచి నగదు, బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసును చేదించిన పోలీసు సిబ్బందిని డీసీపీ అభినందించారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి



సందీప్ (ఫైల్)

కాశిబుగ్గ: రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ మండలం, వెంకటాపూర్‌కు చెందిన వరిపెల్లి సందీప్ అలియాస్ సన్నీ (26) తన తమ్ముడు రాజుతో కలిసి వరంగల్ నగరంలో నివాసం ఉంటూ హంటర్‌రోడ్డులోని టిఫిన్ బండిపై మాస్టర్ కుక్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అండర్‌బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. దీంతో సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.



భిక్షపతి మృతదేహం

మోపెడ్ అదుపు తప్పి..

బచ్చన్నపేట: మోపెడ్ వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మన్‌సాన్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పంజాల భిక్షపతి (60) గ్రామంలో పోస్టుమెన్ ఇస్తున్న పెన్షన్‌ను తీసుకోవడానికి మోపెడ్ వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయాడు. గమనించిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించిగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్ట్ కిల్లర్‌పై పీడీ యాక్ట్



నిందితుడికి పీడీ యాక్ట్ పత్రాలు అందజేస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం: సుపారీ తీసుకొని హత్యలకు పాల్పడిన నిందితుడిపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుపారీ తీసుకొని హత్యలకు పాల్పడిన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన గడ్డం రత్నాకర్‌పై సీపీ జారీ చేసిన పీడీ యాక్ట్ ఉత్తర్వులను కాజీపేట ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి నిందితుడికి శుక్రవారం కరీంనగర్ కారాగారంలో అందజేసిన అనంతరం నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించారు. పీడీ యాక్ట్ అందుకున్న నిందితుడు గత సంవత్సరం కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మహిళ వద్ద సుపారీ తీసుకొని ఆమె భర్తను దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటనలో సుపారీ కిల్లర్‌తో పాటు సుపారీ ఇచ్చిన మహిళతో సహా మరో ముగ్గురిని అరెస్టు చేశారు. పీడీ యాక్ట్ అందుకున్న నిందితుడు గతంలో రాచకొండ, కరీంనగర్, భూపాలపల్లి జిల్లాలో సుపారీ తీసుకొని హత్యలకు పాల్పడినట్లు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయబడుతాయని సీపీ హెచ్చరించారు.

ప్రీతి ఘటనలో విచారణ వేగవంతం

- రెండో రోజు సైఫ్‌ను విచారించిన పోలీసులు

ఎంజీఎం: ప్రీతి ఘటనలో పోలీసుల విచారణ వేగవంతంగా కొనసాగుతుంది. రెండు రోజులుగా సైఫ్‌ను కస్టడీకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. శుక్రవారం విచారణలో పోలీసులు మరింత పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. ప్రీతికి సంబంధించిన సెల్‌ఫోన్ సమాచారం వివరాలతో పోలీసులు కేసు మిగతా ఆధారాల కోసం ముందుకు సాగుతున్నట్లు తెలిసింది. ప్రీతి సెల్‌ఫోన్‌లో 27 స్క్రీన్ షాట్స్, మెస్సేజీలు కీలకంగా మారినట్లు వెల్లడవుతోంది. మెడికో, ఎల్‌డీడీ నాకౌట్ వాట్సాప్ గ్రూపుల నుంచి, మరో ముగ్గురు వైద్యుల నుంచి మెసేజీలు సేకరించారు. సేకరించిన వాటిపై పోలీసులు సైఫ్ నుంచి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ఘటన స్థలంలో ఉన్న హెడ్‌నర్స్, స్టాఫ్ నర్సు నుంచి కూడా మరిన్ని వివరాలు రాబట్టినట్లు చర్చించికుంటున్నారు. ప్రీతీ వాడిన హ్యాండ్ బ్యాగ్‌లో ఏయే వస్తువులు ఉన్నాయనే వివరాలు పోలీసులు తెలుసుకున్నారు. ఘటన రోజు విధులు నిర్వర్తించిన సెక్యూరిటీ గార్డుల నుంచి కీలకమైన అంశాలను సేకరించినట్లు ఎంజీఎంలో సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. సైఫ్ నుంచి సేకరించిన సాంకేతిక ఆధారాలను పోల్చుతూ విచారణ కొనసాగిస్తున్నారు. కేసు పురోగతిపై త్వరలోనే కొలిక్కి తేస్తారనే వాదన వినిపిస్తోంది.

దోషులను కఠినంగా శిక్షించాలి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాంచందర్‌నాయక్



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

- ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

కొడకండ్ల: బంగారు భవిష్యత్ కలిగిన బంజార బిడ్డ ధరావత్ ప్రీతి చదువు దుర్మార్గుడి ర్యాగింగ్‌కు బలవడం విచారకరమని, పోలీసులు ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని గిర్నితండాలో ప్రీతి తల్లిదండ్రులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి చదువుకొని ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ సీటు ప్రభుత్వ కళాశాలలో సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రీతి మృతి కుటుంబానికి కాదని, సమాజానికి తీరని లోటన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో దర్యాప్తు చేయిస్తుందని, సీపీ రంగనాథ్ నేతృత్వంలో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి దోషులకు శిక్ష పడేలా చేస్తాడన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవాసంఘ్ నల్లగొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్‌నాయక్, హేమనాయక్, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సైఫ్‌ను ఉరితీయాలి

హన్మకొండ: డాక్టర్ ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ప్రీతి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ క్యాండిల్స్ వెలిగించారు. ఈ సందర్భంగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ వైద్య విద్యార్థిని ప్రీతి మరణం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు రావుల కోమల, గుజ్జుల వసంత, జిల్లా కార్యదర్శి తోపుచర్ల అర్చన, కేతిరెడ్డి విజయలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

60 కిలోల గంజాయి స్వాధీనం

మారేడుమిల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో అక్రమంగా తరలిస్తున్న 60 కేజీల గంజాయిని శుక్రవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేయగా, మరొకరు పరారైనట్లు వారు తెలిపారు. స్థానిక కొత్తకాలనీ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారు. ఇదే సమయంలో వరంగల్‌కు చెందిన వి. రాజు, జగ్గన్నపేటకు చెందిన ఎల్. రవీందర్ ధారకొండ నుంచి గంజాయిని ఆటోలో తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి నుంచి 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రాము తెలిపారు. ధారకొండకు చెందిన కొర్రా ముకుంద అనే వ్యక్తి పరారైనట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.